

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త


## రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

### రైస్ మిల్లర్ల పై క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుంది

### జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హెచ్చరిక



**నెల్లూరు, కలెక్టరేట్, మార్చి 7, ప్రభాతవార్త** శుక్రవారం కలెక్టర్ వారి ఛాంబర్‌లో రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ను రైతు కు చెల్లించాల్సిందేనన్నారు. అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆయా దళారులు, వ్యాపారుల పై తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. మిల్లర్లు పై కేసులు పెట్టే వరకు పరిస్థితి ని తీసుకురావద్దన్నారు. రైతులు, వ్యాపారులు ఉభయులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉన్నదన్నారు. జిల్లాలోని 105 రైస్ మిల్లుల వద్ద సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. రాబోయే నాలుగు రోజుల్లో బ్యాంక్ గ్యారెంటీలు చూపించాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. బ్యాంక్ గ్యారెంటీలు చూపి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించిన వారికి ప్రభుత్వం తరఫున సహకారం ఉంటుందన్నారు. అంతిమంగా ఆరుగాలం శ్రమించి కష్టించే రైతులు నష్టపోకుండా చూడాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డి ఎస్ ఒ అంకయ్య, పౌర సరఫరాల సంస్థ డియం అర్జున్ రావు, వివిధ రైస్ మిల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ నిధులను సద్వినియోగం చేసుకోవాలి

### పాఠశాలల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయండి

### హెచ్‌ఎంలకు జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచన



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 7, ప్రభాతవార్త** జిల్లాలో పిఎంశ్రీ (ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు మంజూరైన నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ హెచ్‌ఎంలకు సూచించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పిఎంశ్రీ నిధుల వినియోగం, పాఠశాలల్లో పెండిరగ్‌లో వున్న అభివృద్ధి పనులపై సమగ్రశిక్ష ఇంజనీర్లు, హెచ్‌ఎంలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యానాణ్యత, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ప్రతిభాసామర్థ్యాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పిఎం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. ఈ పథకంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 42 పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ పథకం ద్వారా పాఠశాలల్లో కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడామైదానాలు, లైబ్రరీలు, కిచెన్ షెడ్స్, మరుగుదొడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.5.33 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు సుమారు 3 కోట్లు నిధులు ఖర్చయ్యాయని, మిగిలిన 2 కోట్ల నిధులను ఏప్రిల్ నెలాఖరులోగా ఖర్చుచేయాలని, ఎట్టిపరిస్థితుల్లో కూడా నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉండకూడదన్నారు. రాబోయే ఐదేళ్లను దృష్టిలో వుంచుకుని పాఠశాలల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారుచేసి ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య సుమారు 800 వరకు ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఉపాధిహామీ పథకం ద్వారా పాఠశాలల్లో ప్లాంటేషన్, సిసి రోడ్లు మంజూరు చేస్తామని చెప్పారు. స్వచ్ఛభారత్, పిఎంశ్రీ, సమగ్రశిక్ష జనరల్ ఫండ్స్ ద్వారా మంజూరవుతున్న అన్ని నిధులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుని పిఎం శ్రీ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని హెచ్‌ఎంలకు పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో సమగ్రశిక్ష ఎపిసి వెంకటసుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్బరాయులు, ఎఎంసుధీర్‌బాబు, పాఠశాలల హెచ్‌ఎంలు, సమగ్రశిక్ష ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైను కాలువల్లో క్రమంతప్పకుండా పూడికతీత పనులను చేపట్టండి

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 7 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రైను కాలువల పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, పూడికతీత అనంతరం రోడ్లపై సిల్ట్ వ్యర్థాలు లేకుండా వెంటనే తొలగించాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీ.ఎం. సూర్య తేజ గారు 13వ డివిజన్ గౌడ హాస్టల్ సెంటర్, బాలాజీ నగర్, దర్గా వీధి, బ్యాంకు కాలనీ, రెయిన్బో నగర్, గ్యాస్ గోడౌన్ సెంటర్ ప్రాంతాలలో పర్యటించారు. పర్యవేక్షణలో భాగంగా విధులలో నిర్లక్ష్యం వహించిన 13వ వార్డు సచివాలయమునకు సంబంధించిన శానిటేషన్ కార్యదర్శి వెంకటరత్నం, ప్లానింగ్ సెక్రటరీలు మనోజ్, రఘు, ఎమినిటీస్ సెక్రటరీ పవన్ నలుగురికి మెమోలు ఇవ్వవలసినదిగా అధికారులను ఆదేశించారు. పర్యవేక్షణలో మేజర్ కాలువల పూడికతీత సిల్ట్ తొలగింపు చర్యలను చేపట్టవలసిందిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే మెయిన్ రోడ్లలో భవన నిర్మాణాల వ్యర్థాలు, రోడ్డుమీద ఉపయోగంలో లేని కరెంటు స్తంభాలు, రోడ్డు మధ్యలో వేలాడుతున్న వైర్లను గుర్తించి సంబంధిత కార్యదర్శులపై కమిషనరు ఆగ్రహం వ్యక్తం చేశారు. నివాసము లేని ప్రైవేట్ బిల్డింగ్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి, విషపు కీటకాలు చేరుటకు అవకాశం ఉన్నందున సంబంధిత భవన యజమానికి వెంటనే ప్రాంగణము శుభ్ర పరచుకొనవల్సిందిగా నోటీసు జారీ చేయవలసిందిగా పబ్లిక్ హెల్త్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఇటీవల కాలంలో నిర్మించిన రోడ్లు కృంగిపోయినట్లు గమనించిన కమిషనర్ సంబంధిత కాంట్రాక్టరుకు నోటీసులు జారీ చేయవలసిందిగా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అలాగే గ్యాస్ గోడౌన్ వద్ద అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనమునకు సంబంధించిన నివేదికలు ఇవ్వవలసినదిగా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం రామలింగాపురం వద్దనున్న అన్న క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించారు. క్యాంటీన్ లో టోకెన్ విధానము, పారిశుధ్య నిర్వాహణపై నిర్వాహకులకు వివిధ సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, హార్టికల్చర్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘురాం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ప్రకాష్, సర్వేయర్ కామేశ్వరరావు, రెవిన్యూ ఆఫీసర్ ఇనాయతుల్ల, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష



**బిట్రగుంట మార్చి 7 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల తొమ్మిది నుండి 15వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల తుది ఏర్పాట్లపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లని పరిశీలించడంతోపాటు తగిన సూచనలు సలహాలు ఆయన తెలియజేశారు బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మరొకసారి అధికారులకు వివరించారు ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు కావలి ఆర్.డి.ఒ వంశీకృష్ణ, ఆలయ ఈఓ రాధాకృష్ణ ఆలయ ధర్మకర్తలమండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ,టిడిపి మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు, టీడీపీ నేతలు చిలకపాటి వెంకటేశ్వర్లు, రావి విజయ్ యాదవ్, కోడూరు వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, మార్చి7, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 57.088టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 600, పెన్నా డెల్టాకు 1450, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 97.591 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# ధాన్యం మద్దతుధరకంటే తక్కువకు కొంటే మిల్లర్ల పై చర్యలు

### రైతులు ఆందోళన చెందవద్దు

### ప్రభుత్వం తోడుగా ఉంటుంది

### 24 గం. నుండి 48 గం. లోపు చెల్లింపులు

### 1 కోటి 75 లక్షల విలువ గల ధాన్యాన్ని కొనుగోలు చేసి

### 1 కోటి 66 లక్షలు ఇప్పటికే చెల్లింపు

### రైతులు ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు అందుబాటులో 40 గోడౌన్లు

### జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

### కలెక్టర్ ఓ. ఆనంద్



**నెల్లూరు, కలెక్టరేట్, మార్చి 7, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర కంటే తక్కువకు కొంటే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఒ. ఆనంద్ అన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు అనవసర ఆందోళనకు గురి కాకుండా రైతు సేవా కేంద్రాలను వినియోగించుకుని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందవలసినదిగా జిల్లా కలెక్టర్ ఒ. ఆనంద్ రైతులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలసి కలెక్టర్ పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, సంబంధిత రైస్ మిల్లర్ల పై క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ను రైతులకు చెల్లించాల్సిందేనన్నారు. అంతకంటే తక్కువకు కొనుగోలు చేస్తే ఆయా దళారులు, వ్యాపారుల పై తీవ్ర చర్యలు ఉంటాయన్నారు. మిల్లర్లు పై కేసులు పెట్టే వరకు పరిస్థితిని తీసుకురావద్దన్నారు. రైతులు, వ్యాపారులు, ఉభయులు నష్టపోకుండా ప్రభుత్వానికి మంచి ప్రభుత్వం సేకరించిన బియ్యాన్ని ప్రభుత్వ హాస్టళ్లకు, మధ్యాహ్న భోజన పథకానికి వినియోగించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుండి 48 గంటల లోపు డబ్బు వారి అకౌంట్ల లో ఖచ్చితంగా జమ అవుతాయన్నారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి సంబంధించి ఒక కోటి 76 లక్షలకు గాను, ఒక కోటి 66 లక్షలు 24 గంటల్లోనే జమ చేసామన్నారు. ఇప్పటివరకు 700 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించామని, రాబోయే కొద్ది రోజుల్లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. గత 34 సంవత్సరాలుగా జిల్లాలో ప్రాక్యూర్మెంట్ లేదని, దాని వల్ల కొంత అవగాహన తక్కువగా ఉందన్నారు. మండల స్థాయిలో రైతులకు అవగాహన కలిగించేందుకు తహసీల్దార్, ఎంపిడిఓల సారధ్యంలో సమావేశాలు ఏర్పాటు చేయాలని, ప్రతి సచివాలయ కేంద్రం గా 50 మంది రైతులతో గ్రామసభలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆదేశించామన్నారు. జిల్లాలోని 105 రైస్ మిల్లుల వద్ద రెవిన్యూ సిబ్బందిని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. అలాగే తేమ శాతం గురించి రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు జిల్లాలో 40 బహుళర్థ సాధక గోడౌన్లను, వ్యవసాయ మార్కెట్ యార్డ్ లను నిల్వ ఉంచుకునేందుకు అందుబాటులో ఉన్నాయన్నారు. హమాలి, గోనె సంచులు, రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. రైతులు సొంతంగా రవాణా చేసుకుంటే ఆయా చార్జీలను సైతం చెల్లిస్తామన్నారు. రైతులు ధాన్యం కోతల తేదీలను ముందుగా కొనుగోలు కేంద్రాల వారికి తెలియజేసి షెడ్యూల్ చేయించుకుంటే ఎటువంటి ఇబ్బంది లేకుండా అమ్మకాలు సాఫీగా జరుగుతాయన్నారు. మిల్లర్లు ఇప్పటికే 20 కోట్ల వరకు బ్యాంక్ గ్యారెంటీలు చూపించా రన్నారు. గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. బ్యాంక్ గ్యారెంటీలు చూపి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించిన వారికి ప్రభుత్వం తరఫున సహకారం ఉంటుందన్నారు. జిల్లాలో 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని,1.5 లక్షల టన్నుల స్థానికంగా వినియోగిస్తారని ,మిగిలినది మార్కెట్ కు వస్తుందన్నారు. జిల్లాలో 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బంది కి శిక్షణ ఇచ్చామన్నారు. రైతులకు అన్ని వేళలా ప్రభుత్వం తోడుగా ఉంటుందని, ఎటువంటి భయాందోళనలకు గురి కావద్దని కలెక్టర్ రైతులను కోరారు.

# మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే విజయం తధ్యం

### ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

### అంబారాన్నంటిన వేడుకలు

### ఆదర్శ మహిళలకు ఘన సన్మానం

### అవమానాలకు కుంగిపోకుండా ఆశావహ దృక్పథంలో ముందుకు సాగాలి

### సీఎం చంద్రబాబు, ఎంపీ వేమిరెడ్డి సహకారంతో ఈ స్థాయికి చేరుకున్నా

### కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి









**బుచ్చి మార్చి 7 ప్రభాతవార్త** మహిళలు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే విజయం తధ్యమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పష్టం చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడుతు మహిళలు ముందు ఇల్లు చక్క దిద్దుకోవాలని తరువాత బయట రాణించాలని ఆమె మహిళలకు సూచించారు. మార్చి 8 కాదు మహిళా దినోత్సవం ప్రతి రోజు,ప్రతి క్షణం మహిళా దినోత్సవమేనని ఆమె స్పష్టం చేశారు. ఏటువంటి సమస్య అయినా పరిష్కరించగలిగే శక్తి మహిళకే ఉందని అన్నారు. మహిళలు నిరాశ చెందకుండా నిత్యం ముందడుగు వేయాలని అన్నారు. మహిళలు కేవలం వంట చేసి నాపని అయిపోయింది అనుకోకడదని అన్నారు.

**మొదట మహిళలకు కుటుంబం ముఖ్యమని అన్నారు.** మహిళలు నేడు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఆమె తెలిపారు. మహిళలకు పాజిటివ్‌గా ఆలోచించాలని ఆమె సూచించారు. నేను శాసనసభ్యురాలు అయేందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని ఆమె స్పష్టం చేశారు. నాప్రతి విజయం వెనుక వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పూర్తి సహకారం ఉందని ఆమె పేర్కొన్నారు. చైర్‌పర్సన్ మోర్ల చెప్పింది అక్షర సత్యమని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ జక్కా శేషమ్మ ఎమ్మెల్యేకి రాజ్యాంగం బుక్‌ను అందజేశారు. అనంతరం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మాట్లాడుతు స్త్రీ లేకపోతే జననం లేదు... స్త్రీలేకపోతే గమనం లేదు....స్త్రీలేకపోతే సృష్టిలో జీవంలేదు.... స్త్రీలేకపోతే అసలు సృష్టేలేదని అన్నారు. తల్లిగా, బిడ్డగా, చెల్లిగా, బార్యగా, అనేక పాత్రలో ఎంతో సేవచేస్తున్న స్త్రీమూర్తులందరికి ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు ప్రతి రంగంలో పురుషుల కన్నా మిన్నగా స్త్రీలే ఉన్నారని ఇది గర్వించదగ్గ విషయమని అన్నారు. మన నియోజకవర్గం తొలి మహిళా శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కావడం మనందరం గర్వంచదగ్గ విషయమని అన్నారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు అన్ని రంగాలలో ప్రాధాన్యతను ఇస్తున్నారని ఆమె కొనియాడారు. నాభర్త మోర్ల మురళీ నా విజయానికి కారణమని ఆమె పేర్కొన్నారు. వంటింటికే పరిమతమైన నన్ను ఈరోజు ఇలా సభావేదికపైన మాట్లాడే శక్తి నిచ్చారని ఆమె ప్రశంసించారు.

**ఈ సందర్భంగా చైర్‌పర్సన్** మోర్ల సుప్రజా ఎమ్మెల్యేకి కిరిటీం, కత్తి బహుకరించగా ఎమ్మెల్యే వెంటనే దానిని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజాకి అలంకరించగా సభలో హర్షద్వానాలు మిన్నంటాయి. ఈకార్యక్రమం విజయవంతం అయ్యేందుకు పూర్తి స్థాయిలో కృషి చేసిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజాను, కౌన్సిలర్ అందె ప్రత్యూషాను అమె అభినందించారు. ఈకార్యక్రమంలో నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, మోర్ల మురళీ, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, వైస్ చైర్మన్ యరపల్లిశివకుమార్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు వంశీ కృష్ణారెడ్డి , కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, జడ్‌పిటిసి సభ్యురాలు నూరా ప్రదీప, మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్య, నాయకులు బత్తల హరికృష్ణా, వింజం రామానాయుడు, హరి రెడ్డి, భువనేశ్వరం మురళీ, ఆర్యవైశ్య మండలాద్యక్షులు మాల్యాద్రి, మారం జగదీష్, తాళ్ళ నరసింహస్వామి, కమీషనర్ బాలకృష్ణా, సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, కౌన్సిలర్ రహమత్, మైనార్టీ నాయకులు పఠాన్ మహబూభాషా, ఎంపిడిఓ శ్రీహరి, మహేష్‌నాయుడు, పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు ,రెయిన్‌బో స్కూల్ చిన్నారులు వందెమాతరం గీతం ఆలపించారు. కొంతమంది చిన్నారులు కోలటం ప్రదర్శన చేశారు. అలాగే కొంతమంది చిన్నారులు భరతనాట్యం వేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నేతన్నల కోసం టెక్స్‌టైల్ పార్కు నిర్మించాలి

### అసెంబ్లీలో కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త : సుప్రసిద్ధంగా** పేరు గాంచిన జరీ చీరలు తయారయ్యే కోవూరు నుంచి తాను ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం భగవంతుని సంకల్పం అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభలో ఆమె చేనేత రంగాన్ని బలోపేతం చేసే దిశగా తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించారు. గతంలో పాటూరు జరీ చీరలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండేదన్నారు. అయితే గత ప్రభుత్వం నిర్వాకం కారణంగా పాటూరు జరీ చీరలకు ఆదరణ లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల్లో ఆశలు మళ్లీ చిగురించాయన్నారు. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మంగళగిరిలో చేనేతల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వాన్ని కోరారు. కోవూరు నియోజకవర్గంలోని పాటూరు,. పరిసర గ్రామాల్లో పద్మశాలి, దేవాంగ, కైకాల, తొగట లాంటి 9 ఉప కులాల వారు 40 వేల వరకు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. అటువంటి వారి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వ సాకారంతో 76 లక్షలతో మంజూరైన మినీ క్లస్టర్‌లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరానికి 20 లక్షల నిధులు విడుదల అయ్యాయని, అందుకు సహాయ సహకారాలు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కూటమి ప్రభుత్వం నేతన్నలను ఆర్థికంగా ఆదుకునే చేనేత సహకార సొసైటీలు రాష్ట్ర వ్యాప్తంగా 45 ఏర్పాటు చేశారని, అందులో 3 సొసైటీలు కోవూరు నియోజకవర్గంలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా నేతన్నలకు ముడిసరుకు, మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. కోవూరు ప్రాంతంలో అత్యాధునిక డిజైన్‌లకు సంబంధించిన టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని ఈసందర్భంగా ఆమె విజ్ఞప్తి చేశారు. చేనేతలకు ప్రత్యేక భవనం నిర్మించాలని ఈ సందర్భంగా ఆమె అభ్యర్థించారు. ఆరోగ్య బీమాతో పాటు, చేనేతలతకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీల పురోగతిపై శాసనసభలో ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర చేనేత శాఖా మంత్రి సవిత సమాధానమిచ్చారు. ఈ హామీలకు సంబంధించి త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం చేనేత కార్మికులకు ఎన్‌హెచ్‌డీసీ ద్వారా సబ్సిడీ రుణాలను 50 సంవత్సరాలకే ఎన్టీఆర్ భరోసా పించన్‌ను అందిస్తున్నామని ఈ సందర్భంగా వివరించారు.

## రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** కోవూరులోని రైతు సేవా కేంద్రంలో గురువారం కేంద్రం పరిధిలో ఉన్న రైతులతో సహయ వ్యవసాయ సంచాలకులు సుజాత ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని 17 శాతం వచ్చే వరకు ఆరబెట్టాల్సిన అవసరం లేదని, తేమ శాతం బట్టి ధర నిర్ణయించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సాగు చేసిన ప్రతి రైతు ఈకేవైసీ, ఈ పంట నమోదు తప్పనిసరి అన్నారు. కోతలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఒక వారంలోగా రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల దగ్గర షెడ్యూలింగ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధిరిణి ఇందిరావతి, తదితరులు ఉన్నారు.

## రూ. 25 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణ పనులు



**పడుగుపాడు(కోవూరు,) మార్చి 7 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో 15వ ఆర్థిక సంఘం కింద మంజూరైన నిధుల్లో రూ. 25 లక్షల వ్యయంతో కాటంరెడ్డి రామచంద్రారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేగూరు హజరత్ బాబు, తదితరులు ఉన్నారు.

## సంఘమిత్రలో ఉత్సాహంగా ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు





**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో గురువారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సంఘమిత్రలో పనిచేస్తున్న వీవోఏలు, ఇతర మహిళా ఉద్యోగులు కార్యాలయంలో నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలను మహిళల కోసం వెలుగు ఏపీఎం సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన మహిళా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, చైతన్యబాబు, రాము, శోభ, సంఘమిత్ర అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** జిల్లాలోని అన్ని పంచాయతీల కార్యద ర్శులు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి డీపీవో డాక్టర్ పి. రమణయ్య అన్నారు. కోవూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం సెలవు రోజు అయినా పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న 722 గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను తప్పక నిర్వహించాలన్నారు. అదే సమయంలో ఇంటింటికి వెళ్లి పన్నుల వసూళ్లు చేయడం చెత్తను తడి చెత్త, పొడి చెత్త రూపంలో చెత్త నుంచి సంపద కేంద్రాలకు చేర్చడం, వాటికి సంబంధించిన ఫొటోలు తీసి కమిషనర్ యాప్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. అదేవిధంగా శనివారం నాలుగు డివిజన్లకు సంబంధించి స్వమిత్ర పై శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాలను పంచాయతీ విస్తరణాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలు మార్చి 10వ తేది లోగా 60 శాతం పన్నులు, మార్చి 25వ తేది లోగా నూరుశాతం పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. అదేవిధంగా గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వం సూచించిన సర్వేలను మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసేలా దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

## ఒంటరితనాన్ని భరించలేక వృద్ధుడు ఆత్మహత్య



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** వృద్ధాప్యంలో భార్య మరణించడంతో భరనత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నాలుగు సంవత్సరాల క్రితం భార్య మరణించడంతో ఆ బాధ తట్టుకోలేక ఈ నెల 5వ తేది భార్య సంవత్సరికం సందర్భంగా చుండుగుంట గ్రామానికి చెందిన ఎన్. మునెయ్య (79) పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఆసుపత్రిలో చిక్సి పొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఈ మేరకు ట్రైనీ డీఎస్పీ శివప్రియ ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన సదస్సు



**మనుబోలు 7 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మనుబోలు మండలం లోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో జలజాక్షి ఉప తహసిల్దార్ బషీర్ పాల్గొన్నారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి జైహింద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం సాధారణంగా ఒక బస్తా 1950 రూపాయలు పుట్టికి నిర్దేశించడం జరిగిందన్నారు ఏ గ్రేడ్ ధాన్యం 19720 రూపాయలు నిర్దేశించిందని టన్ను ప్రమాణాలకు లోబడి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమము మండలం లోని కట్టువపల్లి వీరంపల్లి వెంకన్నపాలెం మడమనూరు చేర్లోపల్లి గ్రామాల్లో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల విఏఏ లు శ్రీదేవి ప్రశాంత్ ప్రతాప్ రైతులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ రహదారిపైప్రత్యేక డ్రైవ్



**మనుబోలు 7 ప్రభాతవార్త :** జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికం గా జరుగుతున్న నేపథ్యం లో నిర్లక్ష్యం గా వాహనాలు నడిపిన హెల్మెట్ లేకపోయినా ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసిన పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించు కున్నటు వంటి ఆటోలపై చట్ట రీత్యా కేసుకు నమోదు చేయటం జరుగుతుందని మనుబోలు ఎస్ఐ శివ రాకేష్ తెలియచేశారు మనుబోలు పోలీస్ స్టేషన్ ఎదుట జాతీయ రహదారి వద్ద పై అధికారుల ఆదేశాలమేరకు ప్రత్యేక డ్రైవ్ ను శుక్రవారం నాడు నిర్వహించారు వాహనదారుల పత్రాలను పరిశీలించారు ఈ సందర్భంగా గా ప్రమాదాలు తగ్గించటం లో తమవంతుగా కృషి చేస్తున్నామని ఎస్ఐ తెలియచేశారు

## ఉదయగిరి మండల బీజేపీ అధ్యక్షురాలిగా పాలుగుళ్ల విజయలక్ష్మీ



**ఉదయగిరి, మార్చి 7, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని అన్నపూర్ణ నగర్‌లో గల బీజేపీ పార్టీ కార్యాలయం నందు శుక్రవారం మండల బీజేపీ అధ్యక్షురాలిగా విజయలక్ష్మీ బాధ్య తలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయగిరి బీజేపీపార్టీ కార్యాలయంలో ఆమెకు ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ గడ్డం విజయ్‌కుమార్, జిల్లా సంస్థాగత ఎన్నికల అధికారి వెంపులూరి భాస్కర్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబోలు రాజేష్, అలాగే మండల బీజేపీ నేతలు పాల్గొని విజయలక్ష్మీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల స్థాయి నాయకులు బూత్ స్థాయి నాయకులు నారాయణరెడ్డి మాధవరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు, బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈఓ-2



**ఉదయగిరి, మార్చి 7 ,ప్రభాతవార్త :** ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి-2 తోట శ్రీనివాసులు ఉదయగిరి మండలంలోని పదో తరగతి పరీక్షలు జరుగు పరీక్షా కేంద్రాలైన జిల్లా ఉన్నత పాఠశాల గండిపాలెం, ఏపీఆర్ ఎస్ గండిపాలెం, సెయింట్ మేరీస్ ప్రైవేటు హైస్కూల్ ఉదయగిరి, హోలి ఏంజెల్స్ ప్రైవేటు హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి మొదట జిల్లా ఉన్నత పాఠశాల గండిపాలెం పాఠశాల ప్రార్థనా సమయానికి చేరుకొని 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి ప్రార్థనా సమయంలో కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. తదుపరి పరీక్షలు జరుగు గదులను పరిశీలిస్తూ పరీక్షలు రాయబోవు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బెంచీలు, వెంటిలేషన్, ఫ్యాన్స్, లైటింగ్, తాగునీటి సదుపాయాలను, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ తదితర మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండేటట్లు చూసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల యొక్క అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర



**జోరేపల్లి(రాపూరు), మార్చి7ప్రభాతవార్త :** ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వరి పంట సాగుచేస్తున్న రైతులు వారు పండించిన ధాన్యాన్ని ధాన్యాం కొనుగోలు కేంద్రాలలో విక్రయించడం ద్వారా వారి పంటకు గిట్టుబాటు ధర పోందవచ్చని రాపూరు తహశిల్దార్ లక్ష్మీ నరసింహం తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని జోరేపల్లి, సిద్ధవరం, గ్రామాలలో రైతులకు ధాన్యాం కొనుగోలు కేంద్రాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రైతులు వారి పంటకు సంబందించిన వివరాలను ధాన్యం కోనుగోలు కేంద్రాల వద్ద నమొదు చేసుకోని వారు పండించిన ధాన్యాన్ని కోనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవడం ద్వారా వారి పంటకు గిట్టుభాటు ధరతో పాటు ఇందుకు సంబందించిన నగదును కూడా త్వరితగతిన పోందే అవకాశం వుందని ఈ అవకాశాన్ని వరిపంట సాగుచేస్తున్న రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యంపీడీఓ మారెళ్ళ భవాని, మండల వ్యవసాయాధికారి సోమ సుందర్, పలువురు రైతులు తదితరులున్నారు.

## నేటి మేగా లోక్ ఆధాలత్‌లో కేసులు రాజీ చేసుకోండి



**రాపూరు, మార్చి7ప్రభాతవార్త :** వెంకటగిరి కోర్టులో శనివారం నిర్వహించనున్న మేగా లోక్ ఆధాలత్‌లో వివిద కేసులకు సంబందించి ఇరువార్గాలు రాజీ చేసుకోవాలని రాపూరు ఎస్ఐ వెంకట రాజేష్ కోరారు. శుక్రవారం ఆయన విలేఖర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వివిద కేసులకు సంబందించిన ఇరువర్గాల వారు ఈ మేగా లోక్ ఆధాలత్‌కు హాజరై వారి కేసులను రాజీ చేసుకునేందుకు అవకాశం వుందని ఈ అవకాశాన్ని కేసుల వున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దోంగతనాలను ఆదుపు చేసేందుకు ప్రతి ఒక్కరు సిసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. రాపూరులోని ప్రధాన కూడళ్ళలో ఇప్పటికే సీసీ కెమరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

## మాజీ సిఎం జగన్ దిష్టిబొమ్మ దగ్ధం



**కలువాయి మార్చి 7 ప్రభాతవార్త :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తు కలువాయి బస్టాండ్ సెంటర్ నందు జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మను మండల జనసేన నాయకులు శుక్రవారం దగ్ధం చేశారు. మండలా ధ్యక్షులు పెరంకొండ మనోహార్ ఆద్వర్యంలో నిర్వహించగా ఆయన మాట్లాడుతు ఒకటి నుండి 21 వ స్దానాలు సంపాదించి ప్రజలల మన్ననలు పొందిన వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ఇదే జగన్‌మోహన్‌రెడ్డి 175 స్దానాలలో పోటీ చేసి ప్రతి పక్షా హోదా అయినా ఇవ్వండి అనే స్దితికి దిగజారాడని ఎద్దెవ చేశారు. జిల్లా కార్యదర్శి చాముండి రాదమ్మ, వెంకటగిరి టౌన్ అద్యక్షులు అనీల్ రామారావు, స్దానికనాయకులు తోకల ప్రవల్లిక, నరేష్, రామకిషోర్, వెంకటపతి, జనసేన సైనికులు పాల్గోన్నారు.

## ఉదయగిరి అభివృద్ధికి ఎమ్మెల్యే కాకర్ల కృషి అద్భుతం

**సీతారామపురం మార్చి 7 ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధిపై ఎమ్మెల్యేకాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆదిశగా అడుగులు వేస్తున్నారని మండల తెలుగు యువత నాయకులు ఎడమ ప్రవీణ తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు ఏర్పాటు చేసినప్పటి నుండి తరచు ఉదయగిరి ప్రాంత అభివృద్ధి ప్రజలు ఎదుర్కొంటున్న శాశ్వత సమస్యల పరిష్కారం కోసం గళం ఇప్పుతు సమస్యల పరిష్కారం దిశగా ఆయా శాఖల మంత్రుల నుండి పరిష్కార హామిలు తీసుకుంటు అభివృద్ధివైపు ఉదయగిరి ప్రాంతాన్ని శాసనసభ్యులు కాకర్ల సురేష్ తీసుకొని వెళుతున్నారని ఉదయగిరి నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎవ్వరు చేయని విధంగా ఉదయగిరి ప్రాంతం పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తు ఉదయగిరి ప్రాంత అభివృద్ధి కోసం నిధులు సమకూరుస్తు ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గండిపాళెం రిజర్వాయర్ కామదేను ప్రాజక్తు, విద్యావైద్యం, ఆర్‌డబ్ల్యూస్ పనులు ముఖ్యముంగా ఘటిక సిద్దేశ్వరం మరియు వెంగా మాంబ దేవస్దానాలు అభివృద్ధి వంటి అన్ని శాఖలకు సంబంధించిన సమస్యలను శాసనసభలో మంత్రు ల దృష్టికి తీసుకొని వెళ్ళి వాటిని పరిష్కరించాలని వాటి పరిష్కారం దిశగా ప్రయత్నించిన ఎమ్మెల్యేను నియోజకవర్గ ప్రజలు మెచ్చుకుంటున్నారని అన్నారు.




## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**కలువాయి మార్చి 7 ప్రభాతవార్త** మండలంలోని గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దారు శ్యామ్ సుందర్‌రాజు వ్యవసాయాధికారి వి.ప్రతాప్‌లు శుక్రవారం పరిశీలించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల గురించి అవగాహన కార్యక్రమాన్ని అదే విధంగా సిబ్బందికి సలహాలు సూచనలు అందజేశారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు 2 వేల 5 వందల మెట్రిక్ టన్నుల కన్న అధికంగా దిగుబడి వచ్చే తెలుగురాయపురం, వెరిబొట్ల పల్లి గ్రామాలలో ఏ గ్రేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. 2 వేల 5 వందలు మెట్రిక్ టన్నుల కన్నా తక్కువ దిగుబడి వచ్చే బద్దివోలు ,మాదన్నగారి పల్లి, కుల్లూరు కలువాయి గ్రామాలలో బి గ్రేడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఇవ్వడం జరిగిందని అన్నారు. రైతులు ధరలు తగ్గుతున్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతు పండిందిచన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధికారులు తెలిపారు. ఎగ్రేడు వరి రకాలు క్వింటా 2320 రూపాయాలు, ఒక పుట్టి అయితే 19720 రూపాయాలు సాధరాణ రకాలు అయితే క్వింటా 2 వేల 3 వందల రూపాయాలు ఒక్క పుట్టి అయితే 19500 రూపాయాలు చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలియజేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్ముకోవాలంటే రైతులు ఈ - పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రామకృష్ణా, విఆర్‌ఒలు జైరామయ్య, దొరసానమ్మ లక్ష్మీ, విఏఏలు, నాగభూషణం, చెంచయ్య మేఘన, హజరత్తయ్య పాల్గోన్నారు.

## డిబియస్‌లో ఘనంగా మహిళా దినోత్సవం




**కావలిరూరల్, మార్చి07 ప్రభాతవార్త :** డిబియస్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ టివి రావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.రమేష్‌బాబు, లేడీఫ్యాకల్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం ప్రతిసంవ త్సరం మార్చి 8వతేదిన జరుపుతారని తెలియచేశారు. ఈ దినోత్సవాన్ని మొట్టమొదట మహిళాశ్రామిక దినోత్సవంగా పిలిచేవారన్నారు. వివిధ ప్రాంతాల్లో ఈ ఆచరణ మహిళలకు గౌరవం, గుర్తింపును ఇస్తుందని ప్రేమలగురించిన సాధారణ ఉత్సవంనుండి మహిళల ఆర్థిక, రాజకీయ, సామాజిక సాధనల ఉత్సవంగా ఉంటుందని తెలియచేశారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ గురించి వక్తృత్వపోటీలను, మ్యూజికల్‌చైర్స్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి కేక్‌ను కట్‌చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరక్టర్ దాసరి శివసాగర్‌కుమార్, విద్యార్థినులు, అన్నివిభాగాల మహిళాఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

## వసూళ్లలో నిర్లక్ష్యంకూ.....
## 22 మంది అడ్మిన్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 7 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, ఇంచార్జ్ అడ్మిన్ కార్యదర్శులు 22 మందికి రెవిన్యూ వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న కారణంతో కమిషనర్ సూర్యతేజ షోకాజ్ నోటీసులను శుక్రవారం జారీ చేశారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారి ఆదేశాల మేరకు ఈ నెల చివరి నాటికి కరెంట్ డిమాండ్ 100% అరియర్ డిమాండ్ 75% పూర్తి చేయాలని నిర్దేశించారని తెలిపారు. అయితే ఈనెల 6వ తేదీన సూచించిన అడ్మిన్ కార్యదర్శులు జీరో వసూళ్లను చేయడంతో వారందరికీ షోకాజు నోటీసులు జారీ చేశామన్నారు. అలాగే నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో కొందరు అడ్మిన్ కార్యదర్శులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారని, ఈనెల చివరి నాటికి 100% లక్ష్యాలను పూర్తి చేయడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. షోకాజ్ నోటీసులు అందుకున్న అడ్మిన్ కార్యదర్శులు రాతపూర్వకంగా వివరణ తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు.

## ప్రారంభమైన ఇంటర్ స్పాట్ వాల్యూషన్



**నెల్లూరు, మర్చి7 ప్రభాతవార్త విద్య :** నగరంలోని స్థానిక స్టోన్ హౌస్ పేటలోని కే.ఏ.సి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారంనుండి ఇంటర్ పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకణం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి, క్యాంప్ ఆఫీసరు డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు మాట్లాడుతూ సంస్కృత భాష మూల్యాంకం కోసం హాజరైన చీఫ్ మరియు అసిస్టెంట్ ఎక్స మినర్లు సమయపాలన పాటిస్తూ, విద్యార్థికి న్యాయం జరిగేలా మూల్యాంకనం చేయాలన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుండి హాజరైన సంస్కృత అధ్యాపకులతో పాటు కే.ఏ.సి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి, సౌత్ మోపూర్ ప్రిన్సిపాల్ లీ. విజయలక్ష్మి ్మ సమావేశంలో పాల్గొన్నారు. ఇంటర్ పరీక్షల్లో 511 మంది గైర్హాజరు..శుక్రవారం జిల్లాలోని 79 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో జనరల్ విభాగంలో 23,575 మంది విద్యార్థులకు గాను 23,106 మంది హాజరు కాగా 469 మంది గైర్హాజరయ్యారు. అలాగే వొకేషనల్ విభాగంలో 994 మందికి గాను 42 మంది గైరా జరు కాగా 952 మంది హాజరయ్యారు. మొతంగా 511 మంది గైర్హాజరైయ్యారు. ఈ సందర్భగా ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఈరోజు తమ ఫ్లైయింగ్ మరియు సిట్టింగ్ స్క్వాడ్ లు 26 పరీక్షా కేంద్రాలను సందర్శించగా, తాము ముత్తుకూరు లోని గురుకుల కళాశాలను, తోటపల్లి గూడూరు లోని ప్రభుత్వ కళా శాలను, ధనలక్ష్మి ్మపురంలోని జుతీళి, నారాయణ, శ్రీచైతన్య కళాశాలలను తనిఖీ చేయటం జరిగిందన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ర్యాలీ



**నెల్లూరు క్రైమ్, మార్చి 7, ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 వారోత్స వాల లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యస్.పి. జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగరంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో, మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్‌సౌజన్య, అడిషనల్ యస్.పి.(ఏఆర్) మునిరాజ, నేతృత్వంలో ఐసిడిఎస్ విభాగం అధ్వర్యంలో దాదాపు 150 మంది స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అదనపు ఎస్పీ జెండా ఊపి ర్యాలీను ప్రారంభించగా, ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నుండి కెవిఆర్ పెట్రోల్ బంక్ వరకు ర్యాలీ నిర్వహించి, పిల్లలతో ఫ్లాష్ డ్యాన్స్ చేయించారు. మహిళలో ఆత్మవిశ్వాసం, నమ్మకం, ధైర్యం కలిగించడమే ర్యాలీ ప్రాధాన ధ్యేయంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. అందరూ మహిళలను గౌరవంగా చూడాలని ఉన్నత స్థానం కల్పించాలని ఆమె ఆకాంక్షించారు. మహిళలతో నడుచుకునే విధానం, ప్రవర్తన గురించి అవగాహన కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి సుశీలాదేవి, టౌన్ డిఎస్పి సింధు ప్రియ, ఏఆర్ డిఎస్పి చంద్రమోహన్ , ఉమెన్ పిఎస్ సిఐ సుబ్బారావు, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐ అంకమరావు, ఐసిడియస్ పీడీ సుశీలదేవి, డిసిపిఓ సురేష్, అర్బన్ సిడిపిఓ లక్ష్మి దేవి, రూరల్ సిడిపిఓ అనురాధ, లెక్చరర్ లేపాక్షి, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



## జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి



**కలువాయి మార్చి 7 ప్రభాతవార్త :** పిఠాపురంలో చిత్రాడ నందు ఈ నెల 14న జరగ బోయే జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ వెంకటగిరి నియోజకర్గం, మండల స్దాయి నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బస్టాండ్ సెంటర్ నందు పార్టీ మండలాద్యక్షులు పెరంకొండ మనోహర్ ఆద్వర్యంలో ఆవిర్భావ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఒక గొప్ప పండుగ వాతావరణంలో నిర్వహించేలా పార్టీ వ్యవస్థాపక అద్యక్షులు పవన్ కళ్యాణ్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారని జనసైనికులు వీరమహిళలు, అభిమానులు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గోని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన



**సైదాపురం,మార్చి 7 ,ప్రభాతవార్త :** సైదాపురం మండలంలోని రామసాగరం, అనంతమడుగు, చీకవోలు, తురిమెర్ల, గిద్దలూరు, తుమ్మలతలుపూరు, సైదాపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహశీల్దార్ ఈగ రమాదేవి, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, మండల వ్యవసాయ శాఖాది కారిణి హైమావతి శుక్రవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించారు. మద్దతు ధర వివరాలు, షెడ్యూలింగ్ విధి విధానాలను, తేమశాతం మిషన్లపై రైతులకు వివరించారు. గ్రేడ్-1 రకమునకు చెందిన వరి పుట్టి ధర రూ.19720లు, సాధారణ రకం ధర రూ.19550లు ఉంటుందని, రైతులకు హైమావతి వివరించారు. రైతులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మహిళలందరూ విద్యను అభ్యసించి ఉన్నతస్థాయిలో నిలవాలి



**కావలిరూరల్, మార్చి 7 ప్రభాతవార్త :** మహిళలు ఉన్నతవిద్యను అభ్యసించి అత్యున్నతస్థాయిలో నిలవాలని జవహర్‌భారతి డిగ్రీకళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కోఆర్డినేటర్ వి.వసుంధరాదేవి తెలియచేశారు. కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జా తీయ మహిళాదినోత్సవాన్ని కళాశాల ఉమెన్ ఎన్‌ఫో ర్స్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో మొక్క లునాటడం జరిగింది. అనంతరం వి.వసుంధరదేవి మాట్లాడారు. 2025వ సంవత్సరంయొక్కొ ఉమెన్స్‌డే థీమ్ ఆక్సెలరేట్ ప్రకారం మహిళలందరూ ఉన్నతవిద్యను అభ్యసించి విద్యారంగంలో, వైద్యరంగంలో పారిశ్రామికరంగంలో ఉన్నతస్థాయిలో నిలవాలని తెలియచేశారు. ఉమెన్ టెక్నాలజి, ఉమెన్ ఇన్ ఆస్ట్రోనాట్ విభాగంలోకూడా ఉత్తమ ప్రతిభ చూపాలని తెలియచేశారు. విద్యార్థినులందరూ ఉన్నతశిఖరాలను అధిరోహించిన మహిళలను ఆదర్శంగా తీసుకుని తమ గమ్యాన్ని చేరుకోవాలని తెలియచేశారు. కళాశాల స్వయంఉపాధికోర్సుల డైరక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి మాట్లాడారు. విద్యార్థినులు క్రమశిక్షణతో, కష్టపడిచదివి తమ జీవితాలను ఉన్నతంగా, ఆర్థికంగా ఉన్నతి సాధించాలని కోరారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, డిగ్రీకళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డిలు, మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులకు అంతర్జాతీయ మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు.

## గ్రామీణ విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి



**కావలిరూరల్, మార్చి07 ప్రభాతవార్త :** నేడు కావలిరూరల్ మండలపరిధిలోని 33కె.వి మద్దూరుపాడు, 33కె.వి తుమ్మలపెంట, 33కె.వి చెన్నాయపాలెం సబ్‌స్టేషన్లలో మరమ్మత్తుల కారణంగా 11కె.వి లైన్ క్రిందగల చెట్లుకొట్టే కార్యక్రమం ఉన్నందున ఉదయం 8.30 గంటలనుండి మధ్యాహ్నం 12.30 గంటలవరకు పై తెలిపిన సబ్‌స్టేషన్స్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని కావలిరూరల్ మండల విద్యుత్‌శాఖ ఏ.ఈ చేజర్ల శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలియచేశారు. కావున ఆయా గ్రామాలపరిధిలోని విద్యుత్ వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియచేశారు.

## మహిళల మౌలిక సమస్యల పరిష్కారంకోసం ఉద్యమిద్దాం



**కావలిరూరల్, మార్చి07 ప్రభాతవార్త :** మహిళల మౌలికసమస్యల పరిష్కారంకోసం సంఘటితంగా ఉద్యమిద్దామని స్త్రీవిముక్తి సంఘటన జిల్లాకార్యవర్గసభ్యురాలు ఎల్.శ్యామల తెలియచేశారు. అంతర్జాతీయదినోత్సవం సందర్భంగా కావలి పట్టణంలోని 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌నందు స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవేంద్రరావు అధ్యక్షతన మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఎల్.శ్యామల మాట్లాడారు. 150 సంవత్సరాల తర్వాతకూడా మహిళల పరిస్థితి ఎలాఉంది అని మనం పరిశీలిస్తే పేద, మధ్యతరగతి మహిళలు ఏదో ఒకపనిచేస్తేతప్ప కుటుంబం పరిస్థితి వ్యవసాయం, షాపింగ్‌మాల్స్, విద్య, వైద్యం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అతితక్కువ వేతనాలకు పనిచేస్తూ శ్రమదోపిడికి గురవుతూ ఏ హక్కులూలేకుండా కుటుంబం, ఉద్యోగబాధ్యతలను బ్యాలెన్స్‌చేసుకుంటూ వత్తిడికి గురవుతూ శ్రమచేస్తూ జీవిస్తున్నారని తెలియచేశారు. చిన్నఉద్యోగాలదగ్గరనుండి పెద్దపదవులలో ఉన్న మహిళలవరకూ లైంగికవేధింపులు, హింసాత్మకదాడులకు గురవుతన్నారన్నారు. వీటిని అరిట్టాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, మహిళా అభ్యుదయవాది ఉమారాజేశ్వరి, బిఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత డి.ఈ రావికోటిరెడ్డి, ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు లక్ష్మిపావని, తదితరులు పాల్గొని తగిన సూచనలు, సలహాలు తెలియచేశారు.

## ప్రాథమిక పాఠశాలలో తిథి భోజనం



**వింజమూరు, మార్చి 7 ,ప్రభాతవార్త :** వింజమూరులోని పాతూరు మండల జ్రా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు జూపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల వారి కుటుంబ సమేతంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవి దర్శన భాగ్యం నేపధ్యంలో పాఠశాల విద్యార్థులకు ఒక రోజు తిథి భోజనం నిర్వహించడం జరిగింది. విద్యార్థులకు రుచికరమైన వంటలతో ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, కొండారెడ్డి, చంద్రన్, శైలజ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీప్రసన్నుడి సన్నిధిలో బీద గోకుల్ రిస్వంత్ దంపతులు



**బిట్రగుంట మార్చి 7 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జ్యోతి దంపతుల కుమారుడు బీద గోకుల్ రిస్వంత్ నూతన దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఈపూరు సత్యనారాయణ చార్యులు, ఈవో అరవ రాధాకృష్ణ ఆలయ మర్యాదల తో స్వాగతం పలికారు అనంతరం శ్రీ స్వామివారి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు వారి వెంట బీద రవిచంద్ర సతీమణి బీద జ్యోతి,మండల టిడిపి కన్వీనర్ ఎం నాగేశ్వరరావు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



**లింగసముద్రం, మార్చి 7 ,ప్రభాతవార్త :** విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 95 సర్వీసులకు గాను నాలుగు లక్షల పైన అపరాధ రుసుంను విధించినట్లు కందుకూరు డివిజన్ ఎక్సి కేటివ్, విజిలెన్స్ ఎం.నాగేశ్వ రరావు, ఈఈ టి.హైమావతి తెలిపారు. శుక్రవారం స్థానిక లింగసముద్రం సబ్ స్టేషన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేయుట చట్టరీత్యా నేరం అన్నారు. మండలంలో పెద్దపవని, చిన్న పవని మొగిలిచర్ల, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, అంగరేకులపాడ, ఆర్ఆర్‌పాలెం, నరసింహపురం, మరికొన్ని గ్రామాలలో మొత్తం 90 మంది సిబ్బంది 29 బృందాలుగా ఏర్పడి 2865 సర్వీసులను తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వాడకంతో పాటు చౌర్యానికి పాల్పడిన వారికి అపరాధ రుసుము విధించారు. ఇటువంటి వారిపై చర్యలు తప్పవని ఈఈ టి.హైమావతి హెచ్చరించడం జరిగింది ఈ దాడుల్లో కందుకూరు ఈఈ ఎ.నాగేశ్వరరావు, కందుకూరు రూరల్ డీఈఈ ఆర్.విజయబాబు, లింగసముద్రం ఏఈ షేక్ ఫిరోజ, పలువురు ఏడీఏలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనీస మద్దతుధర షెడ్యూల్ పైన అవగాహన



**బిట్రగుంట మార్చి 7 ప్రభాతవార్త :** బోగోలు మండలం లోని జువ్వలదిన్నె, ఏనుగులబావి గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం రైతులకు ధాన్యం విక్రయించేందుకు తేమశాతం, మద్దతుధర, నాణ్యతప్రమాణం షెడ్యూల్ పైన అవగాహన కల్గించినట్లు మండల వ్యవసాయ శాఖధికారిణి విజయలక్ష్మి చెప్పారు .రైతులు ఈ ప్రమాణాలు పాటించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజాసేవకుడైన ఎమ్మెల్యే వెంటే మేమంతా



**వింజమూరు, మార్చి 7 ,ప్రభాతవార్త :** ప్రజాసేవకుడైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వెంటే మేమంతా ఉంటామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పై అవినీతి మరక అంటించాలని చూస్తే ఉద్యమానికి ఊపిరి పోస్తామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరులోని తెలుగుదేశంప్రధాన పార్టీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నేతల ఆధ్వర్యంలోపాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ర దేశమైన అమెరికాలో స్థిరపడి భరతమాత బిడ్డగా పురిటి గడ్డ రుణం తీర్చుకునేందుకు మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో కాలు మోపి మండల కేంద్రమైన వింజమూరులో కాకర్ల చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి నియోజకవర్గ వ్యాప్తంగా ఎంతో మంది అభాగ్యులను ఆదుకొని ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్య రథం ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించి అన్న క్యాంటీన్ ద్వారా నిరుపేదల ఆకలి తీర్చిన, కుటుంబ పోషణ కోసం తోపుడుబండ్లను పంపిణీ చేసి అన్నదాలను ఆదుకునేందుకు వ్యవసాయ పనిముట్లును ఉంచితంగా పంపిణీ చేసి, ఆడపడుచుల ఆర్థిక ఎదుగుదలకు కుట్టు మిషన్, బ్యూటీ పార్లర్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా శిక్షణ ఇచ్చిన ప్రజా సేవకుడుగా పేరుపొందిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తేఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కొన్ని చానెల్స్ పత్రికలు, యూట్యూబ్ ఛానల్స్ వారు పనిగట్టుకొని వారి లాభార్జనే ధ్యేయంగా ఎదుటివారిపై బురదచల్లే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇకపై అటువంటి వారిని సహించమని తెలిపారు. ప్రతి సామాన్య మానవుడు కూడా నేరుగా కలుసుకునే అవకాశం కల్పించిన నేత ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అని తెలిపారు. వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్న ఎమ్మెల్యేకి మేమందరం ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. గడిచిన ఎనిమిది నెలల కాలంలో ఎలాంటి సమస్యలను తీసుకువచ్చిన ఇట్టే పరిష్కరిస్తున్నారని ఇటువంటి ఎమ్మెల్యే దొరకడం మన అదృష్టం అని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అన్యాయాలను బహిర్గతం చేయలేని వారు ఇప్పుడు పనికట్టుకుని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. పదవులు పంపకాలు, కాంట్రాక్టర్ల వాటాలు వీరి చేతుల మీదగానే పంచాలి అన్నట్లు ప్రచారం చేయడం, చానల్ ప్రచారానికి పరాకాష్ట అన్నారు. వీరు వెనుక ఎవరు ఉన్నది, అందరికి తెలుసు అన్నారు. ఇకపై తప్పుడు కథనాలను ప్రచారం చేస్తే ఉద్యమకారుల ఆగ్రహానికి గురవుతున్నారన్నారు. కనుక ప్రజా సేవకుడైన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి వెన్నంటి నడిచి ఉదయగిరి అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షులు మంద సుజాత, ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌ఛార్జీలు సీనియర్ నాయకులు, బెజవాడ బాల గురవయ్య, గొల్లపల్లి మోహన్ రావు, గంగపట్ల సింహాద్రి, గోచిపాతల ఆనందరావు, గోసాల సుధాకర్, నందిపోగు వెంగళరావు, మల్లెల తిరుమలేష్, కొడవటికంటి కిరణ్, బొర్రా వెంగళరావు, గంగపట్ల మురళి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు స్వశక్తిగా ఎదగాలి



**వింజమూరు, మార్చి 7 ,ప్రభాతవార్త :** వింజమూరులోని స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో మహిళా దినోత్సవ వేడుకలు ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు చేత కేక్ కట్ చేపించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుత స మాజంలో మహిళలు అన్ని రంగాల్లో అన్ని అవకా శాలను అందిపుచ్చుకొని అగ్రగామిగా నిలవడం ఎంతో సంతోషకరమని ఆయన కొనియాడారు. మహిళలు ఇంకా స్వయం శక్తిగా ఎదగడానికి అనేక అవకాశాలు, రుణాలు రూపంలో బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నాయని అన్నారు. మహిళామణులు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందని ఆయన కొనియాడారు. స్వయం సహాయం ద్వారా మహిళలక యాభై వేల నుండి రెండు లక్షల వరకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహిం చా లంటే మహిళలు ఆలోచన ధోరణిలో మార్పు రావాలని ఆయన కోరారు. ఎస్‌బీ డిప్యూటీ మేనేజర్ మధు, కృష్ణమోహన్, క్యాషియర్ మహేష్, ఓ.హరికృష్ణ, సిబ్బంది కృష్ణయ్య, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు





**ఆత్మకూరు,మార్చి7,ప్రభాతవార్త:** ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రాజెక్ట్ అధికారిణి సి.సునీలత ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవమనేది మహిళల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ విజయాలను గుర్తు చేసుకునే పండుగ అన్నారు. ఇది ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచ కార్యక్రమంగా జరుపుకుంటామన్నారు. మహిళలను గౌరవించడమే గాక మహిళల సమానత్వాన్ని వేగవంతం చేసేందుకు పిలుపునిస్తుందన్నారు. ఈసంవత్సరంలో మహిళా దినోత్సవం ఉద్దేశం " చర్యను వేగవంతం చేయండి "ఈ ఇతివృత్తం పురోగతి సాధించడంకంటే సాహసోపేతమైన, నిర్ణయాత్మక చర్యల ద్వారా లింగసమానత్వాన్ని నడిపించాల్సిన తక్షణ అవసరాన్ని హైలెట్ చేస్తుందన్నారు. వేతనాల అంతరాలతను తగ్గించడం, నాయకత్వం అవకాశాలను పెంచడం, విద్య, ఆరోగ్య సంరక్షణకు సమాన ప్రాముఖ్యతను నిర్ధారించడంలో ప్రయత్నాలను వేగవంతం చేయాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని , అదే విధంగా ప్రతి విషయంలో అవగాహనను పెంచుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి తన సొంత నిధులతో సమకూర్చిన బహుమతులను అందజేశారు. అంగన్‌వాడీ హెల్పర్లను బహుమతులతో సన్మానించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సిడిపిఒ సునీలతను శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజరలను కార్యకర్తలు సన్మానించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎన్.నారాయణమ్మ, ఎన్.నాగేశ్వరమ్మ, విజయలక్ష్మి, కస్తూరి, పద్మావతి, రమాదేవి, సురేఖ, కార్యాలయ సిబ్బంది కరీమా, మహాలక్ష్మి ,రమేష్,లను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



**అల్లూరు,మార్చి 7 ప్రభాతవార్త:** అల్లూరు మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం అల్లూరు తాసిల్దార్ లక్ష్మినారాయణ అల్లూరు ఆర్బికే కేంద్రం నందు రైతులు అవగాహన కల్పించారు అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీడీవో రజనీకాంత్ ఏవో వెంకటేశ్వర్లు కలిసి మాట్లాడుతూ మండలంలో 13 ధాన్యపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని దళారుల మాటలు నమ్మి నష్టపోవద్దని రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం విక్రయించుకునే విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర 1955 నుండి 1972 ప్రకటించారని మండలంలో ఏర్పాటు చేసిన ప్రొక్యూర్మెంట్ సెంటర్లో రైతులు అన్ని వివరాలు తెలియజేస్తారని తాసిల్దార్ ఎంపీడీవో అగ్రికల్చర్ ఏవో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం జరిగిందని రైతులకు ఏ అవసరం వచ్చినా మేము అందుబాటులో ఉంటాం అని తెలిపారు

## కొనుగోలు కేంద్రాలపై గ్రామ సభలు పెట్టి అవగాహన సదస్సులు

**ఉదయగిరి, మార్చి 7 ,ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గుడి నరవ గ్రామంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఉదయగిరి మండలంలోని 12 సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలపై గ్రామ సభలు పెట్టి అవగాహన సదస్సులు నిర్వహించారు. దీనిలో భాగంగా గుడి నడవ గ్రామంలో నిర్వహించినటువంటి వరి కొనుగోలు కేంద్రం అవగాహన సదస్సులో, ఎంఏఓ, ఎంపీడీఓ, రెవెన్యూ డిపార్టుమెంట్ వాళ్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా వరి పంట వేసిన రైతులను ఉద్దేశించి రైతు సేవ కేంద్రం నందు 2 పంట నమోదు చేసుకున్న రైతులు వరి పంటను గుడినరవ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసినటువంటి వరి కొనుగోలు కేంద్రంలో కనీస మద్దతు ధర కి అమ్ముకోవాలని కోరారు. రైతులు ఎవరు కూడా బయట దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. గ్రేడ్-ఏ రకం అయితే రూ.2320, కామన్ రకం రూ.2300 ఉందని గుర్తు చేశారు. అదే విధంగా గోనెసంచులు, లేబర్ ఛార్జ్, రవాణా ఖర్చులు అంతను ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ భరిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్, ఎంపీడీఓ అప్పాజీ, సొసైటీ సీఈఓ పోలయ్య, గ్రామ సర్పంచ్ కృష్ణ, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఈఓ చే ఎంపిడిఓ కార్యాలయం తనిఖీ



**బిట్రగుంట మార్చి 7 ప్రభాతవార్త :** బోగోలు మండల పరిషత్కార్యాలయం ను జిల్లాపరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారి టి. మోహనరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలం లోని పంచాయతీలలో జరిగిన 15 ఫైనాన్స్ పనులు, ప్రస్తుతం జరుగుచున్న సర్వేల గురించి వివరములు అడిగినారు. సర్వేల గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి. సుబ్రహ్మణ్యం, కార్యాలయ పరిపాలన అధికారి రేవూరి గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు..

## మిల్లర్లు సహకరించాలి



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** ప్రస్తుతం కోవూరు మండలంలో ధాన్యం కోతల సీజన్ ప్రారంభం అయిందని, దీనిని దృష్టిలో పెట్టుకుని జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కోవూరు మండలంలో ఉన్న రైస్ మిల్లర్ల యాజమాన్యంతో తహసీల్దార్ నిర్మలానందబాబా ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బ్యాంక్ గ్యారెంటీ పొందిన ప్రతి మిల్లు యాజమాని రైతు సేవా కేంద్రాలకు నాణ్యమైన గోతాలను తప్పక అందజేయాలన్నారు. ముఖ్యంగా రైతులు రైస్ మిల్లుకు ధాన్యం తెచ్చిన సమయంలో ఎక్కువ సేపు నిరీక్షణ లేకుండా సకాలంలో ధాన్యాన్ని అన్‌లోడ్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తేమశాతం 17 ఉంటే ప్రభుత్వం ప్రకటించిన ధర వస్తుందని, అనంతరం తేమ శాతం పోరిగే కొద్దీ ఒక కేజీ చొప్పున మిల్లర్లు తీసుకోవాలన్నారు. మిల్లర్లు కూడా రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వారికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారన బాలకోటమ్మ, పడుగుపాడు సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి, కోవూరు మండలంలోని రైస్ మిల్లు అసోసియేషన్ నాయకులు యజమానులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ను రైతులు సద్వినియోగం చేసుకోండి



**చేజర్ల మార్చ్ 7 ప్రభాతవార్త** ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు దాన్యంను విక్రయిస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ బి మురళి తెలియజేశారు. చేజర్ల, ఏటూరు రైతు సేవా కేంద్రాలలో శుక్రవారం ధాన్యం కొనుగోలు పై రైతులతో సమావేశం నిర్వహించారు అనంతరం తాసిల్దార్ మాట్లాడుతూ. . మండలంలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చేజర్ల కోటి తీర్థం మాముడూరు నాగుల వెల్లటూరు పాతపాడు పెరమళ్ళపాడు తిమ్మాయపాలెం తూర్పు పల్లి యనమదల ఏటూరు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. గ్రేడ్ ఏ రకం దాన్యం పుట్టి 19720 రూపాయలు సాధారణ రకం దాన్యం పుట్టి 19550 రూపాయలు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందినీ తెలియజేశారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన త్వరితగతిన రైతులు ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తుందన్నారు. రైతులు తప్పనిసరిగా ధాన్యాన్ని విక్రయించేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. ఎంపీడీవో విజయ లలిత మండల వ్యవ సాయ శాఖ అధికారి శశిధర్ మండల టిడిపి అధ్యక్షుడు రావి లక్ష్మి నర్సా రెడ్డి సోమశిల దక్షిణ కాలువ 24 అధ్యక్షుడు ఉడత హాజ రత్తయ్య బిజెపి నాయకులు బత్తల కృష్ణయ్య కుంకు బాలయ్య నాయుడు వెలుగు ఏపీఎం సుజన చేజర్ల సొసైటీ అధికారి దొర స్వామి రెడ్డి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మమత రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆత్మకూరు ఆర్‌డిఓ



**అనుమసముద్రంపేట, మార్చి7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని రాజవోలు సొసైటీ కేంద్రంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆత్మకూరు ఆర్‌డిఓ బి.పావని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో సమావేశం నిర్వ హించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. అనం తరం ఆర్‌డిఓ మాట్లాడుతూ పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మాలని రైతులకు సూచించారు. ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. గిట్టుబాటు ధరతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ధాన్యం అమ్మిన వెంటనే వారికి నగదు కూడా త్వరితగతిన చెల్లింపులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పేట తహసిల్దార్ రామకృష్ణ, పిసిసి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంపర్లపాడు హైస్కూల్లో ఘనంగా సరస్వతీ పూజ



**అనుమసముద్రంపేట,మార్చి7 ,ప్రభాతవార్త:** గుంపర్లపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠ శాలలో 10వ తరగతి విద్యార్థులు ఘన ంగా సరస్వతీదేవి పూజను నిర్వహి ంచారు. హైస్కూల్ ప్రధానోపా ధ్యాయులు వి.పోతులూరయ్య ఆధ్వ ర్యంలో ఈ కార్యక్రమాలను నర్వహి ంచారు. ఈసంద ర్భంగా పూజారి నాగరాజు సరస్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులను హెచ్ఎం , ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. 10వ తరగతి పరిక్షల్లో కష్టపడి బాగా చదివి మంచిమార్కులు సాధించాలని కోరారు. అదే విధంగా మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాల కు సంబంధజంచిన ఆఫీస్ సబార్డినేటర్ నారాయణమ్మ, ఆయా చిన్నమ్మ , మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు కృష్ణవేణి, పద్మమ్మలను శాలువాలు కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు చిట్టమూరు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావ్, రమణయ్య, మురళీకృష్ణ, విజయ్‌కుమార్, శివకుమార్, మోసెస్, వాసు ,శశివర్ధన్‌బాబు , ఆఫీస్ సిబ్బంది కాన్షిరాం, వెంకట శ్రీనాథ్‌బాబు , విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలపై హింసను అరికట్టడానికి కఠినచర్యలు తీసుకోవాలి



**కావలిరూరల్, మార్చి07 ప్రభాతవార్త :** మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, మహిళలపై హింసను అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని జనవిజ్ఞానవే దిక సమతావింగ్ రాష్ట్రనాయకు లురాలు విజయమ్మ తెలియచేశారు. జనవి జ్ఞాన వేదిక కావలి పట్టణశాఖ ఆధ్వర్యంలో శుక్రవారంకావలి రవినర్సింగ్ హోమ్ నందు అధ్యక్ష రాలు జి.క ళ్యాణి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళాసదస్సును నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న జెవివి రాష్ట్రనాయకురాలు విజయమ్మ మాట్లాడారు. మహిళాదినోత్సవం ఒక ప్రత్యేకమైన రోజున మహిళల విజయాలను, పోరాటాలను వారి త్యాగాలను స్మరించుకోవడం మనందరి కర్తవ్యమని తెలిపారు. మహిళాసాధికారత నిరంతర ప్రక్రియఅని మహిళలు సమాజంలో అన్నిరంగాల్లో సమాన అవకాశాలు పొందాలని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా శక్తివంతం కావాలని తెలియచేశారు. స్త్రీపురుషులు సమానమని లింగవివక్షతను రూపుమాపివిద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలను సమానంగా చూ డాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ జెవివి గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్,అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరెడ్డి హరనాధ్,కోశాధికారి టి.సుబ్బరామశర్మ, జెవివి జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరాం, గాదిరెడ్డి మురళీకృష్ణ, కలయిక విజ్ఞానకేంద్రం సంస్థ వ్యవస్థాపకులు లావ ణ్య దంపతులు, ఉమాశర్మ, కల్లయ్య, పివియస్ సుధాకర్, ఎంవి రమణయ్య, జెవివి మహి ళానాయకురాళ్లు సి.శారద, స్వర్ణలత, షేక్.ఖాదర్‌బి, తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



**వింజమూరు, మార్చి 7 ,ప్రభాతవార్త** మామిడి సాగులో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యాన అధికారి షేక్ షాహిల్ పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు మండల పరిధిలోని మామిడి పంటను సాగు చేస్తున్న రైతులతో కలిసి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే నష్టాలు ఫాలో అవుతారన్నారు. యాజమాన్య పద్ధతులతో పాటిస్తూ లాభసాటిగా ఉంటుందన్నారు. మామిడిలో అధిక నష్టం కలిగించే చీడపీడలైన తేనె మంచు పురుగు తామర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడి వలన పోషక లోపాల ఏర్పడడం హార్మోన్ల అసమతుల్యత ఏర్పడడం జరుగుతుందన్నారు. మామిడికి రాత్రి సమయంలో అధిక చలి పగలు వేడి వాతావరణం అనుకూలం ఈ పరిస్థితుల్లో పూత పిందె రక్షించుకోవడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. పూమొగ్గలు పూత పైన కక్షి కన్ను తెగులు బూజు తెగులు ఆశించడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. రైతులు ఉద్యాన శాఖ అధికారుల సూచన సలహాలు పాటించి మంచి దిగుబడి పొందాలన్నారు. వీహెచ్ఏ భరత్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ టౌన్‌షిప్ లేఅవుట్‌ను సందర్శించిన నుడాచైర్మన్



**జలదంకి, మార్చి7 ప్రభాతవార్త** జలదంకి మండలం జమ్మలపాలెం గ్రామంలో ఏర్పాటుచేసిఉన్న ఎన్‌టిఆర్ టౌన్‌షిప్ లేఅవుట్‌ను నుడాచైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ సూర్యతేజలు శుక్రవారం సందర్శించారు. లేఅవుట్‌లో ప్లాట్లుదారులు త్రాగునీరు, డ్రైనేజి, కరెంటువంటి మౌలికసదుపాయాలు కల్పించాలని కోరగా వెంటనే సంబంధిత అధికారులతో నిర్వాహించాల్సిన పనులగురించి తెలుసుకోవడం జరిగింది. త్వరలో అన్ని మౌలికవసతులు ఏర్పాటు చేస్తామని అధికారులుతెలియచేశారు. టిడిపినాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌ఓని సన్మానించిన ఏపీ హెచ్‌ఎంఎస్ఏ



**నెల్లూరు, మార్చి 7, ప్రభాతవార్త** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నెల్లూరు నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వంగల సుజాతని, శుక్రవారం నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ కార్యాలయంలోని ఆమె చాంబర్లో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్, ఆ కార్యాలయంలోని వమిళా ఉద్యోగులు సిబ్బంది, జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకరరావు, జిల్లా జనరల్ సెక్రటరీ కమల్ కిరణ్ గౌరవ అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ శాఖలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా నిజాయితీ కలిగిన మంచి అధికారిణి డాక్టర్ సుజాతని మహిళా దినోత్స సందర్భంగా సత్కరించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఏపీ హసం అధ్యక్షులు చేజర్ల సుధాకరరావు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత చేతుల మీదుగా ఆఫీసు నందు సేవలందిస్తున్న మహిళ అధికారులు మహిళా ఉద్యోగులు అందర్నీ ఘనంగా సత్కరించి గుర్తింపు పొందిన సంఘంగా ఏపీ హంస ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది. వైద్య, ఆరోగ్య శాఖలో మహిళా అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి సమస్య వచ్చినా వారికి అండగా ఉండేందుకు ఏపీ హంస అసోసియేషన్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి కనకరత్నం, డీపీఎంఓ డాక్టర్ రమేష్, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, ఎన్ఆర్సీ నోడల్ అధికారి డాక్టర్ శివరాముడు, జిల్లా ఏపీడీమిక్ అధికారి డాక్టర్ ఎస్.భాస్కర్, రిటైర్డ్ మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు, ఏపీ హంస జిల్లా ట్రెజరర్ మజార్, గౌరవ సలహాదారులు అరవ పరిమిళ, జిల్లావైస్ ప్రెసిడెంట్లు మురళి, నాగరాజు, జిల్లా మహిళా వింగ్ సెక్రటరీ సుకన్య, ఇందుకూరు పేట తాలూకా ప్రెసిడెంట్ అరుణ రాణి, జిల్లా నాయకులు జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 2వ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, మార్చి 7, ప్రభాతవార్త** అంతర్జాతీయ మహిళా దినోత్సవను పురస్కరించుకొని 2వ రోజు ఏపీ ఎన్‌జీ జీ ఓస్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా మహిళా విభాగం చైర్పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం 2025 వేడుకలు ఏసి సుబ్బారెడ్డి నిర్వహించారు. ఈ దినోత్సవ వేడుకలను జిల్లా పరిషత్ సిఈఓ విద్యారమ జెండా ఊపి రంగవల్లులును ప్రారంభించారు. ఏపీఎన్ జీ జీ ఓస్ అసోసి యేషన్ తరపున ఆటల పోటీలు నిర్వహించడం చాలా మంచి సంప్రదాయమని నెల్లూరు జిల్లాలో ఎండను కూడా లెక్కచేయకుండా ఇంత అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందని జిల్లా పరిషత్ సి ఈ ఓ విద్యారమ కొనియాడారు. రెండు రోజులు మహిళలు ఉత్సాహంగా ఆడుకోవటానికి సెలవులు మంజూరు చేసిన నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు నెల్లూరు జిల్లా ఎన్ జి ఓ నాయకులు మన్నేపల్లి పెంచలరావు, రామకృష్ణ, ఆంజనేయవర్మ, కరుణమ్మ, పెంచలయ్య, ప్రసాద్ రెడ్డి, కృష్ణం రాజు, సతీష్ బాబు, కిరణ్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, విజయ కుమార్, కృష్ణకుమార్, సువర్ణ, స్వర్ణలత, నవోదయ, రామకృష్ణ రెడ్డి, మార్కండేయులు, సురేష్, చెంచయ్య, మధు, మురళి, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను కలిసిన కావలి "అమరా"




కావలి, మార్చి07 ప్రభాతవార్త విశాఖపట్నం నోవాటెల్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌ను కావలికి చెందిన ఆల్ ఇండియా వ్యాపారమండల్ జాతీయ కార్యదర్శి, బిజెపి నేత, జియస్‌టి సభ్యుడు, ప్రముఖ వస్త్రవ్యాపారి అమరా వెంకటసుబ్బారావు కలిశారు. ఈ సమావేశంలో జరిగిన పోస్ట్‌బడ్జెట్ ఇంట్రాక్షన్‌లో ఆయన తనదైనశైలిలో మాట్లాడి కావలి బావుటాను ఎగురవేశారు. 12లక్షల 50వేలరూపాయల ఆదాయ పరిమితిని పెంచడంతో మధ్యరకం కుటుంబాలవారికి ఎంతో ఉపయోగపడుతుందని, మీ బడ్జెట్ ఎంతో బాగుందని అమరా కితాబిచ్చారు. అలాగే జియస్‌టిలో సర్వీస్ సెక్టార్‌లో 20 లక్షల నుంచి 40 లక్షలవరకు పెంచుతూ వర్తింపచేస్తే వ్యాపారస్తులకు ఎంతో బాగుంటుందన్నారు. అందరిని ఆకర్షిస్తూ అమరా మాట్లాడారు. అనంతరం ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ఒక జ్ఞాపికను బహూకరించారు. ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ఎక్స్‌పోర్టర్స్ అండ్ ఇన్‌పోర్టర్స్, ప్రముఖ ఆడిటర్లు, ప్రముఖ వ్యాపారస్తులు పాల్గొన్నారు. దాదాపు 200ల మందిలో మాట్లాడే అవకాశం పదిమందికే ఇవ్వడంతో వారిలో కావలి అమరా ఒకరు కావడం గర్వకారణం.

## మహిళలను టిడిపి ప్రభుత్వం దగా చేసింది



**నెల్లూరు రూరల్, మార్చి 7, ప్రభాతవార్త** అర్ధరాత్రి వరకు బారులు తీరి మరి పూర్తమి ప్రభుత్వాన్ని గెలిపించిన మహిళలను నిట్టి నిలవన టిడిపి ప్రభుత్వం దగా చేసిందని వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా నాయకురాలు మల్లి నిర్మల తెలిపారు. శుక్రవారం నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కోటిలి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ హామీలతో మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని వాటిలో ఏడాది గడిచిన ఒక్క హామీ నెరవేర్చలేదని ఆమె ఎద్దేవా చేశారు. మహిళా సాధికారత కోసం పనిచేసిన ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని వైసీపీ ప్రభుత్వంలో నెరవేర్చారని తెలిపారు. అర్ధరాత్రి వరకు క్యూలో నిలబడి ఓట్లేసిన మహిళలకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలి అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని తెలిపారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ ను కూటమి నేతలే హేళన చేస్తుంటే జనసేన నేతలు మా మీద పడి ఏడుస్తున్నారని తెలిపారు. సీజ్ ద షిప్ అని పవన్ అంటే. తర్వాత రోజే షిప్ ను ప్రభుత్వమే వదిలేశారు. పవన్ కళ్యాణ్ మాటలకు విలువ లేకుండా టిడిపి ప్రభుత్వ వ్యవహరిస్తుందని దానిమీద మాట్లాడలేని జనసేన నాయకులు వైసిపి నాయకులు పై పడి ఏడుస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం పై వరద చెల్లి బతకడం తప్ప తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాక ఒక్క అభివృద్ధి, సంక్షేమాలు పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఇచ్చిన ప్రతి మాట ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుకుంటూ వచ్చిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని అలాంటిది అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఇకనైనా నైతిక విలువలు పాటించి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఉద్యోగాలలో రాణిస్తున్న మహిళలు



**నెల్లూరు, మార్చి 7 ,ప్రభాతవార్త-వైద్యం** ఉద్యోగాల్లో మహిళలు ఎంతగానో రాణిస్తున్నారని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ కొనియాడారు. శుక్రవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో స్కాడా కార్యాలయం నందు మహిళా ఉద్యోగుల సమక్షంలో ఘనంగా మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మహిళ ఉద్యోగులందరికి అంతర్జాతీయ మహిళ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. గృహిణి అన్ని పనులు చేస్తూ అలాగే సంస్థలో విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకుంటూ రెండు పనులు బ్యాలెన్స్ చేసుకుంటూఉంటారని ఇది ఒక్క మహిళకే సాధ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు మహిలలను గౌరవించాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుగా ఉంటుందని తెలిపారు. అనంతరం వంటల కార్యక్రమం నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ శేషాద్రి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఎం.శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రూరల్స్ ఏ.సోమశేఖర్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ ఏ.విజిత, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్స్, విద్యుత్ భవన్‌లోని మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెళ్లికి ఒప్పించాలనే తపనతో తల్లి విషం తాగి ఆత్మహత్య



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** కన్న కొడుకు పెళ్లి చేసుకోమంటే నిరాకరిం చడంతో అతన్ని ఏ విధంగా అయినా పెళ్లికి ఒప్పించాలనే తపనతో చుండుగుంట గ్రామానికిచెందిన ఎన్.సుజన (49) 5వ తేది పురుగులమందుతాగింది. ఈ మేరకు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కొడుకు శ్రీకాంత్ పెళ్లి చేసుకో మంటుంటే దానిని వాయిదా వేయడం తట్టుకోలేని తల్లి విషం తాగి అయినా కొడుకును మార్చాలనే తపనతో విషం తాగింది. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికితరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు శుక్రవారం ట్రైనీ డీఎస్పీ ఆస్పత్రికి వెళ్లి మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు.

## భవన నిర్మాణాల నూతన అనుమతులు, లేఅవుట్ల పై నూతన అవగాహన సదస్సు

### - టౌన్ ప్లానింగ్ ఆర్.డి.డి మధుకుమార్




**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్స్ ల పై నూతనంగా నిర్దేశించిన మార్గదర్శకాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు , ఎల్ టి పిలు అవగాహన పెంచుకోవాలని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమారీ సూచించారు. ఏపీ రాష్ట్ర మున్సిపల్ పట్టణ శాఖ మంత్రి పి. నారాయణ ఆదేశాల మేరకు భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ ల పై నూతనంగా జారీ చేయబడిన ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.యం.యస్ నెం. 3,4,5,20ల పై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నెల్లూరు నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన పట్టణ ప్రణాళిక విభాగంలో నూతన జి.ఓ.యమ్.యన్ నెం.3 లేఔట్, జి.ఓ.యమ్. యస్ నెం.4 నందు బిల్డింగ్ రూల్స్ మార్పులు, జి.ఓ.యమ్.యస్. నెం.5 డెలిగేషన్ పవర్స్, జి.వి.యమ్. యస్ నెం. 20 నందు ఏపీ.డి.పి.ఎం ఎస్, ఆన్ లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టం నందు సెల్ఫ్ సర్టిఫికేట్ స్కీంపై శిక్షణ, అవగాహన కార్యక్రమంలో పై తెలిపిన వార్డు ప్లానింగ్ అండ్ డెగ్యులేషన్ సెక్రటరీలు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ప్రజలకు అవగాహన కల్పించే విధముగా చూడాలని, నూతన ప్రభుత్వ ఉత్తర్వులు మేరకుసిబ్బంది, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ వినిచేయాలని తెలిపారు. బిల్డింగ్ నిర్మాణము జరిగేటప్పుడు ఎటువంటి అతిక్రమములు, అనుమతికి మించి అంతస్తులు నిర్మించిన, సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మాణాలు చేసిన, రోడ్లపై ర్యాంపులు కొట్టడం పై ప్రజలకు టౌన్ ప్లానింగ్ రూల్స్ పట్ల అవగాహన కల్పించే విధముగా అందుకు సిబ్బంది, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ పనిచేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అడిషనల్ కమీషనర్ నందన్ , సి.పి .పద్మజ, నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ప్లానింగ్ ఆఫీసర్ హిమబిందు, ఏ సి పిలు వేణు , ప్రకాష్ బాబు, సీనియర్ లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్ టి పిలు) విశపు లలితా రామ్ , సిహెచ్. శ్రీనివాస్ రావు , ఇన్ చార్జి బిల్డింగ్ ఇన్స్ పెక్టర్లు వార్డుప్లానింగ్అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో పనిచేయుచున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్స్, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్స్, బిల్డింగ్ ఇన్స్పెక్టర్లు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు, జిల్లాలోని లైసెన్సీ టెక్నికల్ పర్సన్స్, బిల్డర్స్ పాల్గొన్నారు.



## రైతుల కోసమే రైతు సేవా కేంద్రాలు



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు తాము పండించిన ధాన్యాన్ని తమ ఇష్టానుసారంగా అమ్ముకోకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు, లేగుంటపాడు, వేగూరు గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఆయన ఎంపీడీవో శ్రీహరిరెడ్డితో కలిసి రైతులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ముందుగా గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సహాయకుల ద్వారా షెడ్యూలింగ్ చేయించుకోవాలన్నారు. 17 శాతం తేమ ఉంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర తప్పక రైతుకు లభిస్తుందన్నారు. నిధుల విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గురువారం పాటూరు, ఇనమడుగు రైతు సేవా కేంద్రాలను సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్ పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు , రైతులు ఉన్నారు.

## నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు

### -అదనపు కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 7 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, రవాణా, విక్రయం తదితరాలను నిషేధిస్తున్నట్లు అదనపు కమిషనర్ వై.ఓ నందన్ స్పష్టం చేశారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు, ఇతర విక్రయదారులతో ప్రత్యేక సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం నాడు "స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్" కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వై.ఓ నందన్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీదారులు, రిటైలర్లు తగిన జాగ్రత్తలు తీసుకొని నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీని ఇకనుంచి కచ్చితంగా ఆపివేయాలని అదనపు కమిషనర్ హెచ్చరించారు. క్రమం తప్పకుండా ప్లాస్టిక్ ఉత్పత్తుల దుకాణాలపై దాడులు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాలకు భారీ స్థాయిలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు తమ పిల్లలను స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగేలా చూడాలి



**నెల్లూరు, మర్చి7 ప్రభాతవార్త విద్య** నారాయణ ఇంజనీరింగ్ కళాశాల నందు " శుక్రవారం కహానియోన్ కా కారవాన్ 2025" కార్యక్రమమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా నారాయణ పాఠశాలల కిండర్ గార్డెన్ చిన్నారులు పాల్గొని ఈ విద్యా సంవత్సరం నందు వారు నేర్చుకున్న కథలను విన్నూత్నముగా ప్రదర్శించారు... ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీమతి డా. బిందు మీనన్, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందు మీనన్ మాట్లాడుతూ పిల్లలు తమ ఆలోచనలను, భావాలను, ఉద్దేశాలను వ్యక్త పరిచే స్వేచ్ఛను, అవకాశాలను కల్పించి ప్రోత్సహించాలని తెలిపారు. ఆదిశగా తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఆమె కోరారు. దీనితో పాటు ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవము ను పురస్కరించుకొని కేక్ కట్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వి. విజయ భాస్కర్ రెడ్డి గారు మాట్లాడుతూ నారాయణవిద్య సంస్థల యందు చదువుతున్న పిల్లలకు చదువుతో పాటు ఆల్ రౌండ్ డెవలప్మెంట్ కొరకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో నూతన కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలుగులో కి తీసుకొని వచ్చే ప్రయత్నాలు చేస్తాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో AGM రవి వర్మ , శ్రీధర్, రమణా రెడ్డి, డీన్ నరేంద్ర, RI అదిశేషయ్య , సెంట్రల్ కార్యాలయ సిబ్బంది అరబీ, స్రవంతి, సాఫ్ట్ స్కిల్ హెడ్ సాధిక్ , డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోవూరు నియోజకవర్గాన్ని టిడ్కో పరిధిలోకి చేర్చండి

### - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**కోవూరు, మార్చి 7 ప్రభాతవార్త :** సెమీ అర్బన్ ప్రాంతమైన కోవూరు నియోజకవర్గాన్ని టిడ్కో పరిధిలోకి చేర్చాలని కోరుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం శాసనసభలో పక్కా గృహాలకు సంబంధించిన అంశాలకు సంబంధించి ఆమె ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ పరిధిలో ఇపనపటివరకు 8660 మంది పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కోవూరు మండలం పడుగుపాడు, విడవలూరు మండలం చౌకచర్ల, కొడవలూరు మండలం చంద్రశేఖర్‌పురంతో పాటు బుచ్చి పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పేదలకు పక్కా గృహాలను కేటాయించాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా.. జోక్యం చేసుకున్న ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు ఈ ప్రశ్న మున్సిపల్ శాఖ పరిధిలోకి రాదన్నారు. ఇందుకు స్పందించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోవూరు నియోజకవర్గం నుడా పరిధిలో ఉన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నియోజకర్గాన్ని టిడ్కో పరిధిలో చేర్చాలని ఉప సభాపతి ద్వారా ఆమె మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకువచ్చారు.

## అధికారులతో ఎంఐజి లేఅవుట్‌ను పరిశీలించిన నుడా చైర్మన్



**కావలి, మార్చి7 ప్రభాతవార్త** కావలి సమీపంలోని జమ్మలపాలెంలో నుడా పరిధిలో వేసిన ఎంఐజి లేఅవుట్‌ను అధికారులతో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పరిశీలించారు. లబ్దిదారులతో ఆయన ముచ్చటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంఐజి లేఅవుట్‌లో 1100ల ప్లాట్స్ ఉన్నాయన్నారు. మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు. ప్రస్తుతం నిర్మించినవి కొన్ని నాణ్యతాపరంగాలేవని వాటిని మళ్లి కాంట్రాక్టర్‌చేత పునఃనిర్మిస్తామని తెలిపారు. ఆయన వెంట నుడావైస్ ఛైర్మన్ సూర్యతేజ, ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## పార్టీ పేరు చెప్పి దందాలకు పాల్పడితే చర్యలు తప్పవు

### ఆర్.పి.ఐ.పార్టీ జిల్లా అధ్యక్షులు మాబు




**నెల్లూరు కార్పొరేషన్, మార్చి 7 ప్రభాతవార్త:** ఆర్.పి.ఐ పార్టీ పేరు చెప్పి దందాలకు పాల్పడిన, అసాంఘిక కార్యక్రమాలు చేపట్టిన ఎవరైనా పార్టీ తీసుకోనున్న చట్టపరమైన చర్యలకు బాధ్యులగుతారనని ఆర్‌పిఐ పార్టీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు షేక్ .మాబు ఘాటుగా వెల్లడించారు. శుక్రవారం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలో ఉన్న ఆర్‌పి ఐ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సం దర్భంగా జిల్లా అధ్యక్షులు మాబు మాట్లాడుతూ ఆర్ పిఐ పార్టీ నుంచి సస్పెండ్ అయిన వ్యక్తులు ఇటీవల మంగళవారం నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవన్ లో ఆర్ పి ఐ పార్టీ పేరు చెప్పి కార్యక్రమాలు నిర్వహించడంపట్ల మండిపడ్డారు. ఒక వ్యక్తిని రెండు రాష్ట్రాల్లోని పార్టీలో అనేక గొడవలు సృష్టించడాన్ని గమనించిన పార్టీ అతని ఆరు సంవత్సరాలు సస్పెండ్ చేసారని చెప్పారు. వీరే కాకుండా మరొక వ్యక్తి కూడా నిరుపేదలైనటువంటి దళితులకు ఉద్యోగాలు, లోన్లు ఇప్పిస్తానని నగదు వసూలు చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్నాడని , అందుకు సంబంధించి నెల్లూరు ఒంగోలు చిత్తూరు జిల్లాలో అతని మీద పలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని వివరించారు. నెల్లూరు నగరంలోని చిన్న బజారు పీస్ లో కేసు, ముత్తుకూరు పోలీస్ స్టేషన్లో కేసులు కూడా నమోదు అయి ఉన్నాయని పేర్కొన్నారు. మరొక వ్యక్తి పార్టీపేరు , కేంద్ర మంత్రి పేరు చెప్పి ఉద్యోగాలు లోన్లు ఇప్పిస్తానని ఎంతోమంది అమాయకుల దగ్గర అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తే బాధితులు అతనికి దేహశుద్ధి కూడా చేశారని గుర్తు చేశారు. పార్టీ నుంచి గతంలో అతనిని కూడా సస్పెండ్ చేయడం జరిగిందని చెప్పారు. ఇంకా పార్టీ పేరు మంత్రి పేరు చెప్పి అమాయకులను మోసం చేస్తున్నాడని మాకు చాలా ఫిర్యాదులు అందాయని ఈ విషయాన్ని రాష్ట్ర అధ్యక్షులు వారి దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు అతని పైన విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దాసరి కమలాకర్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తల మధుసూదన్ తాటిపర్తి ప్రభాకర్ ఏ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## కండలేరులో 51.148 టీయంసీల నిటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు), మార్చి7ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో శుక్రవారం ఉదయానికి51.148 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళశయంనుండి అవుట్‌ఫ్లోగా హెడ్ రెగ్యులేటర్ నుండి 805 క్యూసెక్కులు, లో లెవల్ స్లూయిస్ ద్వారా 110 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1035 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## ఒక్కసెంటు ప్రభుత్వభూమి ఉన్నా సహించేదిలేదు..!

### ఆ ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకుంటాం..!!

### నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి



**కావలి, మార్చి7 ప్రభాతవార్త** ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అమ్ముకోవడం వారి బాబుసొమ్ము కాదని, ప్రభుత్వస్థలం ప్రభుత్వానికే దక్కాలని నుడాఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కావలి పోలీసు అతిధిగృహంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియాసమావేశంలో శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. కావలిలో అక్రమలేఅవుట్లు రాజ్యమేలుతున్నాయని అయితే ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అక్రమలేఅవుట్లపై కొరడా ఝుళిపించారన్నారు. ఆయనను ఈ సందర్భంగా అభినందిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డితో చర్చలుజరిపి ప్రభుత్వభూమిని ఎలా స్వాధీనం చేసుకోవాలో ఆలోచిస్తామన్నారు. నెల్లూరు జిల్లాలో ఎక్కువశాతం అక్రమలేఅవుట్లు కావలిలోనే ఉన్నాయన్నారు. ఎంతో మంది అక్రమలేఅవుట్‌దారులు తన ఇంటికి మాట్లాడేందుకు వస్తే తాను ఇంట్లోకి కూడా రానివ్వలేదన్నారు. ప్రభుత్వభూమి ప్రభుత్వానికే రావాలన్నారు. మోసంచేసిన వ్యక్తులు బాధితులకు 2రూపాయల వడ్డీతో చెల్లించాలన్నారు. బాధితులు నిలబడితే వారికి తాను అండగా ఉంటానన్నారు. కొనుగోలుదారులను మోసగించినవారిని ఉపేక్షించేదిలేదన్నారు. అక్రమలేఅవుట్లో ప్రభుత్వభూమిని అమ్మి కొనుగోలుదారులను మోసగిస్తే వారి భరతంపట్టేందుకు ఎమ్మెల్యే దగుమాటితో చర్చించి చర్యలు చేపడతామన్నారు. కొనుగోలుదారులు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

**-జమ్మలపాలెంలోని ఎంఐజి లేఅవుట్లో అన్ని వసతులు కల్పిస్తాం...** కావలి సమీపంలోని జమ్మలపాలెంలో నుడా పరిధిలోవేసిన ఎంఐజి లేఅవుట్లో అన్ని వసతులు కల్పిస్తామని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ ఎంఐజి లేఅవుట్లో నాసిరకంగా కట్టిన కాలువలను మళ్లి కాంట్రాక్టర్ పునఃనిర్మించేలా చర్యలు చేపడతామన్నారు. ఎంఐజి లేఅవుట్లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా వైస్‌ఛైర్మన్ ఐఏఎస్ సూర్యతేజ, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, మున్సిపల్ కమీషనర్ జి.శ్రావణ్‌కుమార్, నుడాశాఖ అధికారులు పాల్గొన్నారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని టిడిపినేతలు దుశ్శాలువాలతో, పూలబొకేలతో ఘనంగా సత్కరించారు.